సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 9 । ఫిబ్రవరి । 2023



చీనీ టన్ను రూ.29 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.29 వేలు పలికినట్లు అధికారులు తెలిపారు.



టమాట కిలో రూ.16
అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.16, కనిష్టం రూ.4, సరాసరిన రూ.10 పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
36.5°/14.4°

జిల్లాలో బుధవారం పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఉదయం పూట చలి వాతావరణం కొనసాగింది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

జంక్షన్ ఏర్పాటుకు భూముల పరిశీలన



రైతుల నుంచి సేకరించనున్న భూములను పరిశీలిస్తున్న జేసీ టీఎస్ చేతన్

నల్లమాడ: గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా మండలంలోని బాసంవారిపల్లి వద్ద జంక్షన్ (కూడలి) ఏర్పాటుకు సేకరించాల్సిన భూములను జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ బుధవారం పరిశీలించారు. 14.72 ఎకరాల్లో జంక్షన్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. భూములు కోల్పోయే రైతులకు నష్ట పరిహారం అందించేందుకు వీలుగా ప్రతిపాదనలు పంపాలని, భూముల్లో పండ్లతోటలు, వ్యవసాయ విద్యుత్ మోటార్లు ఉంటే ఆయా శాఖల నుంచి పరిహారం అంచనాలు తెప్పించుకోవాలని తహసీల్దార్ దేవేంద్రనాయక్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో వీఆర్ఓలు, రైతులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష 'కీ' విడుదల

కొత్తచెరువు: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష కీని బుధవారం విడుదల చేసినట్లు ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ఈ నెల 5న జిల్లాలో నిర్వహించామన్నారు. ఇందుకు సంబంధించిన 'కీ'ని ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. 'కీ'లో ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సంబంధిత స్కూల్ లాగిన్‌లోని గ్రీవెన్స్ లింక్ ద్వారా తెలపాలన్నారు. సరైన ఆధారాలు ఉన్న వాటిని మాత్రమే పరిశీలిస్తామని వెల్లడించారు.

నవోదయ దరఖాస్తు గడువు పొడిగింపు

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 15వ తేదీ వరకూ గడువు పొడిగించినట్లు లేపాక్షి విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం దరఖాస్తుకు గతంలో ఈ నెల 8వ తేదీ వరకు అవకాశం ఇచ్చారు. అయితే కొన్ని సాంకేతిక కారణాల దృష్ట్యా దరఖాస్తుకు ఇబ్బందులు తలెత్తడంతో గడువు పొడిగించినట్లు ఆయన వెల్లడించారు. అలాగే ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు...ఎడిట్ చేసుకునేందుకు ఈ నెల 16, 17వ తేదీల్లో అవకాశం ఉంటుందన్నారు.

కేసుల పరిష్కారానికి చొరవ చూపండి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఈ నెల 11న నిర్వహించే లోక్ అదాలత్‌లో వీలైనన్ని కేసులకు పరిష్కారానికి చొరవ చూపాలని పోలీసు అధికారులను అనంతపురం రేంజ్ డీఐజీ రవి ప్రకాష్ ఆదేశించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం, జిల్లా పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. ఉమ్మడి జిల్లాలో పోలీసుల సంక్షేమ చర్యలపై సమీక్షించారు. శ్రీసత్యసాయి జిల్లాలో 10 వేలు, అనంతపురం జిల్లాలో 4,500 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని కేసుల సంఖ్య తగ్గించాలన్నారు. సమావేశంలో ఎస్పీలు ఫకీరప్ప, రాహుల్‌దేవ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపంటనూ నమోదు చేయాలి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న సుబ్బారావు

పుట్టపర్తి: రబీలో రైతులు సాగు చేసిన ప్రతి పంటనూ నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన బుక్కపట్నం మండలం సిద్దరాంపురం, గూనిపల్లి తదితర గ్రామాల్లో రైతులు సాగు చేసిన వేరుశనగ, ఇతర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పంటల పరిస్థితిపై క్షేత్ర స్థాయిలో రైతులతో ముఖాముఖి మాట్లాడారు. తెగులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని ఏఓలు సతీష్, నటరాజ్‌కు సూచించారు. కార్యక్రమంలో వీఆర్ఓ పోతులయ్య,రైతు భరోసా సిబ్బంది ఆశా జ్యోతి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



ముప్పు తప్పినట్టే

కోవిడ్‌పై ఏపీ సర్కార్ విజయం సాధించింది. రెండో వేవ్‌లో వేగంగా ప్రాణాలు తీసిన మహమ్మారికి ప్రభుత్వం వ్యాక్సినేషన్ ద్వారా చెక్ పెట్టింది. క్షేత్రస్థాయిలో అర్హులైన వారందరికీ వ్యాక్సిన్ వేయడంతో రోగనిరోధక శక్తి బాగా పెరిగింది. వైరస్‌ను తట్టుకునే స్థాయికి చేరుకోవడంతో ఆరు నెలల్లో ఒక్క కోవిడ్ కొత్త వేరియంట్ (బీఎఫ్-7) కూడా నమోదు కాలేదు. ప్రజలు ఊపిరి పీల్చుకుని.. తమ పనుల్లో నిమగ్నమైపోయారు.



- కోవిడ్‌పై పోరులో విజయం
- సత్ఫలితాలిచ్చిన వ్యాక్సినేషన్
- కనిపించని బీఎఫ్ 7 వేరియంట్
- గడిచిన వారంలో వంద శ్యాంపిళ్లు పరీక్షించటినా జీరో కేసులు



వృద్ధురాలికి కోవిడ్ వ్యాక్సిన్ వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాకు కోవిడ్ ముప్పు తప్పినట్టేనని వైద్య నిపుణులు భావిస్తున్నారు. కొన్ని నెలలుగా కోవిడ్ కేసులు నమోదు కాకపోవడమే దీనికి కారణమని చెబుతున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో ఒక కేసు నమోదైంది. ఆ తర్వాత ఇప్పటి వరకూ అంటే ఫిబ్రవరి 8 వరకూ ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి అనంతపురంతో సహా ఆరేడు జిల్లాల్లో జీరో కోవిడ్ పాజిటివిటీ నమోదైంది. అనుమానమున్న చోట టెస్టులు చేస్తున్నారు. కానీ ఎక్కడా ఒక్క కేసు కూడా నమోదైన సందర్భాలు లేవు.

ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు కోవిడ్ వ్యాక్సినేషన్ వివరాలు

మొదటి డోస్ వేసుకున్న వారి సంఖ్య
20,52,322

రెండో డోస్ వేసుకున్న వారి సంఖ్య
22,45,161

బూస్టర్ డోస్ వేసుకున్న వారి సంఖ్య
8,69,154

వారం రోజుల్లో వంద శ్యాంపిళ్లు

ఫిబ్రవరి ఒకటి నుంచి ఏడో తేదీ వరకు జిల్లాలో 74 టెస్టులు ట్రూనాట్ పద్ధతిలోనూ, 26 టెస్టులు ఆర్టీపీసీఆర్ పద్ధతిలో చేశారు. కానీ ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. నెల్లూరులో మాత్రం 1.06 పాజిటివిటీ రేటు నమోదైంది. పొరుగునే ఉన్న ఉమ్మడి కర్నూలు, వైఎస్సార్ జిల్లాల్లోనూ జీరో కేసులుగా ఉన్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 44 లక్షల జనాభా ఉండగా.. ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడం చెప్పుకోదగ్గ అంశమని డాక్టర్లు అంటున్నారు.

బీఎఫ్ 7 ప్రభావం ఏమీ లేదు

ఇప్పటికీ చైనాను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది కోవిడ్ వేరియంట్ బీఎఫ్ 7. కానీ ఇది మన దేశంలో పెద్ద ప్రభావమేమీ చూపించలేదు. అనంతపురం జిల్లాకు పొరుగునే బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం ఉంది. పలువురు విదేశాల నుంచి ఇక్కడికి వస్తుంటారు. అయినా సరే జిల్లాలో ఎలాంటి కొత్త వేరియంట్‌లు కనిపించలేదు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జినోమిక్ సర్వేలోనూ ఈ విషయం వెల్లడైంది. దేశంలోనే అత్యంత వేగంగా మన రాష్ట్రంలో ఇంటింటికీ వెళ్లి కోవిడ్ వ్యాక్సినేషన్ నిర్వహించడం వల్ల కేసులు నిరోధించడం సాధ్యమైందనేది కూడా మైక్రోబయాలజిస్ట్‌లు చెబుతున్నారు.

మెజారిటీ జనంలో ఇమ్యూనిటీ

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొదటి, సెకండ్ వేవ్‌లో కరోనా విధ్వంసం సృష్టించిందనే చెప్పాలి. ముఖ్యంగా రెండో వేవ్‌లో డెల్టా వేరియంట్ కారణంగా చాలామంది ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. కానీ ఆ తర్వాత రాష్ట్రంలో కోవిడ్ వ్యాక్సిన్ యుద్ధప్రాతిపదికన చేపట్టడం ద్వారా మెజారిటీ జనంలో ఇమ్యూనిటీ (కోవిడ్‌ను తట్టుకునే వ్యాధినిరోధకత) వచ్చినట్టు తేలింది. హెల్త్ కేర్ వర్కర్లు, ఫ్రంట్‌లైన్ వర్కర్లు, 12 నుంచి 60 ఏళ్ల పైబడిన వారందరికీ క్షేత్రస్థాయిలో వ్యాక్సినేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. సాధారణ వేరియంట్‌లు ఇప్పుడు ఎలాంటి ప్రభావమూ చూపలేవని, ఏదైనా బలమైన కొత్త వేరియంట్ వస్తే తప్ప ప్రస్తుతం ఉన్న కోవిడ్ వేరియంట్‌లు ఏమీ చేయలేవని చెబుతున్నారు.

వంద శాతం వ్యాక్సినేషన్ పూర్తి

ఉమ్మడి జిల్లాలో కోవిడ్ ముందస్తు చర్యల్లో భాగంగా వంద శాతం వ్యాక్సినేషన్ పూర్తి చేశాం. కోవిడ్‌పై భయాందోళన అవసరం లేదు. ఒక వేళ కోవిడ్ సోకినా చిన్నపాటి లక్షణాలే అయినందున ప్రాణహాని ఉండదు.

– డాక్టర్ యుగంధర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, అనంతపురం

మహిళల ఆర్థిక పరిపుష్టే ప్రభుత్వ లక్ష్యం



మహిళా మార్ట్ వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ బసంతకుమార్

బత్తలపల్లి: మహిళల ఆర్థికంగా నిలదొక్కుకుని కుటుంబాలకు అండగా నిలవాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పి.బసంతకుమార్ అన్నారు. బుధవారం ఆయన బత్తలపల్లిలో నూతనంగా ప్రారంభించిన భారతి చేయూత మహిళా మార్ట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మార్ట్‌లో కలియ తిరిగారు. స్టాకు నిల్వ, ధరలు ఇతరత్రా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతూ... మార్ట్‌ను సక్రమంగా నిర్వహించుకోవాలని, ప్రతి వారం నిల్వలు, అమ్మకాలు తదితర వాటిని సరి చూసుకోవాలన్నారు. సీసీ కెమెరాల వద్ద ఒకరు ఉండి ప్రతిదీ గమనించాలన్నారు. వినియోగదారులు అడిగి వస్తువులు లేకపోతే వాటిని నోట్ చేసుకుని స్టాకు తెచ్చుకోవాలన్నారు. అదేవిధంగా పొదుపు సంఘాల సభ్యులే ధాన్యాలకు వ్యాల్యు యాడెడ్(చిను ధాన్యాలతో చేసే పిండి) చేస్తే ఇంకా అధిక లాభాలు వస్తాయన్నారు. మార్ట్‌లోకి వచ్చిన కస్టమర్లకు అన్ని వస్తువులు అందుబాటులో ఉండేవిధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కెఎస్ నరసయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ, డీపీఎం చేయూత రమణప్ప, తహసీల్దార్ యుగేశ్వరిదేవి, ఎంపీడీఓ సాయిమనోహర్, ఏసీ రామేశ్వరరెడ్డి, ఏపీఎంలు సుదర్శన్‌రాజు, శోభారాణి, వీఆర్ఓ రవికాంత్‌రెడ్డి, సాయిమనోజ్‌కుమార్, భరద్వాజ్‌బాబు, సీసీలు, మార్ట్ అధ్యక్షులు, సభ్యులు, ఆరు మండలాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం



ఇంద్ర సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఇక్బాల్, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల



బస్సులో కూర్చుని సౌకర్యాలు ఆరా తీస్తున్న ప్రజాప్రతినిధులు

- ఇంద్ర బస్సుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ ఇక్బాల్, జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల

హిందూపురం: సుశిక్షితులైన డ్రైవర్లు, ప్రయాణికుల అవసరాలు తెలుసుకుని సేవలందించే సిబ్బంది ఆర్టీసీ సొంతమని, అందువల్లే ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ ఎం. మంజుల అన్నారు. బుధవారం సాయంత్రం హిందూపురం ఆర్టీసీ డిపో ఆవరణలో రెండు ఇంద్ర బస్సులను వారు పూజలు చేసి ప్రారంభించారు. ఈ బస్సులు హిందూపురం- హైదరాబాద్ (బీహెచ్‌ఈఎల్) మధ్య నడుస్తాయన్నారు. ఒక సర్వీసు రోజూ రాత్రి 9 హిందూపురం నుంచి హైదరాబాద్ బయలుదేరుతుందని, అదే సమయంలో బీహెచ్‌ఈఎల్ నుంచి మరో సర్వీసు హిందూపురం బయలుదేరుతుందన్నారు. ప్రజలను బాధ్యతగా గమ్యానికి చేర్చడంలో ఆర్టీసీ ఎంతో బాధ్యత యుతంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన ఇంద్ర సర్వీసులో ఏసీ, టీవీతోపాటు ప్రతి సీటుకు సెల్‌చార్జింగ్ సదుపాయం ఏర్పాటు చేశారన్నారు. అంతేగాక తక్కువ స్టాపింగ్‌లతో సమయాన్ని ఆదా చేస్తూ 9 గంటలల్లోనే గమ్యస్థానం చేరుస్తుందన్నారు. అనంతరం ఆర్టీసీ ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ జబివుల్లా, ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ హంపన్న, ఆర్టీసీ ఉద్యోగులు, మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గంజాయి గుట్టురట్టు

- 10 మంది అరెస్టు..36 కిలోల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ రామకృష్ణ



గంజాయి నిందితులను అరెస్టు చూపిస్తున్న పోలీసులు

సాక్షి, పుట్టపర్తి: గంజాయి విక్రయిదారులపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. ముదిగుబ్బ రైల్వే స్టేషన్‌లో గంజాయితో ఉన్న ఐదుగురితో పాటు వారి వద్ద సరుకు కొనుగోలు చేసేందుకు వచ్చిన మరో ఐదుగురిని కలిపి మొత్తంగా 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కిలోల చొప్పున ప్యాక్ చేసిన 18 గంజాయి ప్యాకెట్లు (36 కిలోలు)తో పాటు రూ.36 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జిల్లా అదనపు ఎస్పీ కేవీఆర్‌కే ప్రసాద్ బుధవారం మధ్యాహ్నం పుట్టపర్తిలోని ఎస్పీ కార్యాలయంలో వివరాలను మీడియాకు వెల్లడించారు. సమావేశంలో పెనుకొండ డీఎస్పీ హుస్సేన్ పీరా, ఎస్‌బీ సీఐ రవీందర్ రెడ్డి, ముదిగుబ్బ సీఐ కంబగిరి రాముడు, ముదిగుబ్బ ఎస్ఐ హేమంత్ కుమార్, పట్నం ఎస్ఐ శరత్ చంద్ర, సిబ్బంది పాల్గొన్నారు

పక్కా సమాచారంతోనే..

'ఇంటెలిజెన్స్ విభాగం ఇచ్చిన సమాచారం మేరకు ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆదేశాలతో నిఘా విభాగం సిబ్బంది, ముదిగుబ్బ ఎస్ఐ హేమంత్ కుమార్, పట్నం ఎస్ఐ శరత్ చంద్ర ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడ్డారు. 'ఎన్‌డీపీఎస్ చట్టం – 1985' ప్రకారం ధర్మవరం ఎస్‌డీపీఓ నుంచి సెర్చ్ వారెంట్ తీసుకుని ముదిగుబ్బ రైల్వేస్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం వేచి ఉన్నారు. తుని నుంచి తిరుపతికి వచ్చి.. అక్కడి నుంచి మరో రైలులో ముదిగుబ్బ రైల్వేస్టేషన్‌లో దిగిన ఐదుగురిని అనుసరించారు. వారి దగ్గర గంజాయి తీసుకునేందుకు మరో ఐదుగురి రాగా వెంటనే దాడి చేసి ఎన్‌పీకుంటకు చెందిన సాకే నగేశ్, ఆమూరి రాఘవ, పులివెందులకు చెందిన వనం నగేశ్, కదిరి మండలం కమ్మవారిపల్లికి చెందిన సాకే వీరభద్రయ్య, కదిరి పట్టణంలోని రాయచోటి రోడ్డులోని పూల సునీల్‌కుమార్, కదిరికి చెందిన సాకే ఆంజనేయులు, కొత్తచెరువుకు చెందిన సాకే సరోజ, ముదిగుబ్బకు చెందిన సాకే శీన, అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి మండలం గోపిదిన్నెకి చెందిన ఆవుల రమణమ్మ, హిందూపురానికి చెందిన జె.మిథున్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 36 కిలోల గంజాయితో పాటు రూ.36 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు' ఏఎస్పీ కేవీఆర్‌కే ప్రసాద్ వెల్లడించారు.

కిలో రూ.3 వేలకు కొని.. రూ.6 వేలకు విక్రయం

సాకే నగేశ్, వనం నగేశ్ గ్రూపుగా.. సాకే సరోజ, సాకే శీన మరో గ్రూపుగా ఏర్పడి ఎవరికి వారుగా కాకినాడ జిల్లా తునికి వెళ్లి అక్కడ గంజాయి కిలో రూ.3 వేలకు కొనుగోలు చేసి తిరుపతికి వెళ్లే రైలు ఎక్కి.. ఆ తర్వాత తిరుపతి నుంచి ముదిగుబ్బకు మరో రైలులో చేరుకుంటారు. ఒక్కొక్కరు ఒక్కో ప్రాంతానికి చేరుకుని కిలో రూ.6 వేలకు విక్రయిస్తుంటారు.

సహించేది లేదు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రాన్ని డ్రగ్ ఫ్రీ స్టేట్ గా మార్చడంలో తీసుకుంటున్న వివిధ కార్యక్రమాల్లో భాగంగా ఎక్కడా అక్రమ మద్యం, మాదక ద్రవ్యాలు సరఫరా కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాం. మాదక ద్రవ్యాలను పూర్తి స్థాయిలో నిర్మూలించడంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల్లో పలు విధాలుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– కేవీఆర్‌కే ప్రసాద్, ఏఎస్పీ

నాడు-నేడు పనులు ముమ్మరం

- ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి ఆదేశం



రొళ్లలో ఎఫ్‌ఏ-3 పరీక్షను పర్యవేక్షిస్తున్న ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి

మడకశిర రూరల్/రొళ్ల: రెండో విడత 'నాడు-నేడు' కింద పాఠశాలల్లో చేపట్టిన పనులను వేగవంతం చేయాలని ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి ఆదేశించారు. బుధవారం ఆమె మడకశిర, రొళ్ల మండలాల్లోని పర్యటించారు. తొలుత ఆమె మడకశిర ఎమ్మార్సీ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సీఆర్‌పీలతో 'నాడు- నేడు' పనులపై సమీక్షించారు. పాఠశాలల వారీగా పనుల ప్రగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ శాఖల అధికారులంతా సమష్టిగా పనిచేసి 'నాడు- నేడు' పనులను తర్వతగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. అనంతరం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి 'నాడు-నేడు' పనులను పరిశీలించారు. అంతకుముందు మడకశిర నియోజకవర్గంలోని ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ఫీజుల వసూలు చేస్తున్నాయని, ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి..

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి చేయాలని ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం ఆమె రొళ్ల మండలంలోని వివిధ గ్రామాల్లో 'నాడు-నేడు' కింద చేపట్టిన పాఠశాల భవన నిర్మాణ పనులు పరిశీలించారు. తర్వాత రొళ్ల, రత్నగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎఫ్‌ఏ-3 పరీక్షల నిర్వహణ ప్రక్రియను పర్యవేక్షించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు పరిశీలించి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. జగనన్న గోరుముద్ద పథకం ద్వారా మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని పిల్లలకు వండి పెట్టాలని ఏజెన్సీలకు ఆదేశించారు. ఈ సందర్భంగా ట్యాబ్ వినియోగం గురించి విద్యార్థులతో ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... 'నాడు-నేడు' పథకం కింద నిర్మాణ దశలో ఉన్న పాఠశాల భవనాలు, మరుగుదొడ్లు, ప్రహరీ ఇతరాత్ర నిర్మాణం పనులను సకాలంలో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అదే విధంగా ఎఫ్‌ఏ-3 పరీక్షలు సజావుగా జరిగే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవి ముమ్మాటికీ వక్ఫ్‌బోర్డు ఆస్తులే



ముస్లిం మైనార్టీలతో మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ గౌస్‌మొహిద్దీన్

- జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ గౌస్‌మొహిద్దీన్

లేపాక్షి: మండలంలోని శిరివరం గ్రామంలోని సర్వే నంబర్ 193లోని 4.73 ఎకరాలు, 166లో 1.05 ఎకరాల సాగు భూములు ముమ్మాటికీ వక్ఫ్ బోర్డువేనని, వాటిపై ప్రైవేటు వ్యక్తులకు ఎలాంటి అజమాయిషీ లేదని జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ గౌస్‌మొహిద్దీన్ తేల్చిచెప్పారు. బుధవారం సాయంత్రం ఆయన వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన ఆస్తులను పరిశీలించారు. వారం రోజుల క్రితం శిరివరంలోని జామియా మసీదు ఆవరణలో ఉన్న చింత ఫలసాయం వేలం వేయడానికి ప్రైవేటు వ్యక్తులు పూనుకోగా, మరి కొందరు అడ్డుకున్నారు. చింత చెట్లు వక్ఫ్‌బోర్డు ఆస్తుల్లో ఉన్నాయని, చింత ఫలసాయం వేలం వేయడానికి వీల్లేదన్నారు. ఈ క్రమంలోనే కొందరు జోక్యం చేసుకుని ఈ ఆస్తుపై వక్ఫ్‌బోర్డుకు ఎలాంటి సంబంధం లేదని వాదించారు. దీంతో ఇరువర్గాలు ఘర్షణకు దిగి ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో వక్ఫ్‌బోర్డు కమిటీ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ బుధవారం శిరివరం విచ్చేసి ఇరువర్గాల వారితోనూ విడివిడిగా సమావేశం ఏర్పాటు చేశారు. జామియా మసీదు అభివృద్ధి కోసం ప్రభుత్వం వక్ఫ్‌బోర్డుకు భూములు కేటాయిందన్నారు. ఇందులో వచ్చే ఫలసాయం కూడా మసీదు అభివృద్ధికి ఖర్చు చేయాలని అప్పట్లోనే తీర్మానించింరాన్నారు. ఈ భూములు ప్రైవేటు వ్యక్తులకు ఎలాంటి సంబంధం లేదన్నారు. దీనిపై పూర్తి నివేదికను ఉన్నతాధికారుల అందజేస్తామన్నారు. ముస్లిం మైనార్టీలంతా ఐకమత్యంగా ఉండాలని, అధ్యాత్మిక చింతన అలవరుచుకుని భక్తి మార్గంలో పయనించాలే తప్ప ఘర్షణలకు అవకాశం ఇవ్వకూడదని హితవు పలికారు.

జేవీఎంఆర్డీ పాఠశాలను సందర్శించిన కలెక్టర్

తాడిమర్రి: మండలంలోని నార్సింపల్లిలో విశ్రాంత డీజీపీ జేవీ రాముడు స్థాపించిన జాస్తి వెంకట్రాముడు రూరల్ డెవలప్‌మెంట్ (జేవీఎంఆర్డీ) పాఠశాలను కలెక్టర్ బసంత్‌కుమార్ బుధవారం సందర్శించారు. ప్రధానోపాధ్యాయుడు హరితో పాఠశాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలన్న ఆకాంక్షతో విశ్రాంత డీజీపీ జేవీ రాముడు ఈ పాఠశాలను స్థాపించారని హెచ్‌ఎం హరి వివరించారు. నామమాత్రపు ఫీజులు తీసుకుని నాణ్యమైన విద్యాబోధనను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటుతో పాటు శుద్ధ జలాలను అందజేస్తున్నామన్నారు. అనంతరం కలెక్టర్ ఆరో తరగతిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు.


తరగతి గదిని పరిశీలిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పాఠశాలలో వసతులపై ఆరా తీశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సౌకర్యాలు, వసతులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంఈఓ కృష్ణమోహన్ ఉన్నారు.

ధర్మవరానికి మరో కలికితురాయి

- రూ.8 కోట్ల వ్యయంతో ఆధునిక కాయగూరల మార్కెట్
- రైతులు, ప్రజలు, వ్యాపారులకు పూర్తి స్థాయి వసతుల కల్పన
- జిల్లాలోనే రెండో అతి పెద్ద మార్కెట్‌గా గుర్తింపు
- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి



పాత మార్కెట్‌లో మండుటెండలోనే కాయగూరలు విక్రయిస్తున్న వ్యాపారులు (ఫైల్), ఆధునిక సౌకర్యాలతో నూతనంగా నిర్మించిన మార్కెట్

ధర్మవరం: ఒకప్పుడు వారాంతపు సంతకు వెళ్లాలంటే ధర్మవరం పట్టణంలో వేలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. మరుగుదొడ్లు, నిలువు నీడ లేక మహిళలు, ప్రజలు నానా అవస్థలు పడే వారు. ఇక పండించిన కాయగూరలను మార్కెట్‌లో అమ్ముకునేందుకు వచ్చే రైతులు అర్ధరాత్రి మార్కెట్ ఆవరణలో కటిక నేలపై పడుకునే వారు. ఈ సమస్యకు పరిష్కారం చూపుతూ ఎవరూ ఊహించని విధంగా అత్యాధునిక వసతులతో మార్కెట్‌ను సర్వాంగ సుందరంగా ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తీర్చిదిద్దారు.

శర వేగంగా నిర్మాణ పనులు..

ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని ధర్మవరం కాయగూరల మార్కెట్‌ను తొలగించి నూతన మార్కెట్ నిర్మాణానికి 2021, నవంబర్‌లో ఎమ్మెల్యే కేతిరెడ్డి భూమి పూజ చేశారు. నిపుణులైన ఇంజనీర్ల పర్యవేక్షణలో అన్ని వర్గాల వారికి అనుకూలంగా ఉండేలా భవన సముదాయాలకు రూపకల్పన చేయించారు. 1.79 ఎకరాల విస్తీర్ణంలో రూ.8 కోట్ల వ్యయంతో పనులు చేపట్టి శరవేగంగా పూర్తి చేయించారు. నూతన మార్కెట్‌లో మొత్తం గ్రౌండ్ ఫ్లోర్‌లో 51 గదులు, పై అంతస్తులో మరో 51 గదులు నిర్మించారు. వీటిని హోల్‌సేల్, రిటైల్ విక్రయాలు జరుపుకునేలా వ్యాపారులకు బహిరంగ వేలం ద్వారా గదులను కేటాయించారు. గత మార్కెట్‌లో వ్యాపారంపై ఆధారపడి జీవనం సాగించిన చిరు వ్యాపారులకు నష్టం కలుగకుండా 51 రేకుల షెడ్‌లను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మించి, నామమాత్రపు అద్దెతో ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. షెడ్‌ల కేటాయింపును సైతం బహిరంగ వేలం ద్వారా పారదర్శకంగా కేటాయించారు.

ఆధునిక వసతుల కల్పన..

జిల్లాలోనే రెండో అతి పెద్ద మార్కెట్‌గా గుర్తింపు పొందిన ధర్మవరం కాయగూరల మార్కెట్‌లో అత్యాధునిక వసతుల కల్పనకు పెద్ద పీట వేశారు. మార్కెట్ స్థలంలో 40 శాతం వాహనాల పార్కింగ్‌కు కేటాయించారు. మార్కెట్ చుట్టూ భారీ వాహనాలు సంచరించేందుకు అనువుగా 40 అడుగుల రోడ్డును మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మించారు. వాణిజ్య సముదాయం నాలుగు వైపుల నాలుగు మరుగుదొడ్లను నిర్మించారు. రాత్రిళ్లు పంటను తీసుకువచ్చిన రైతుల విడిదికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మార్కెట్‌లో వ్యర్థాలు ఎక్కడబడితే అక్కడ పడేయకుండా వెడల్పాటి డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేశారు.

అడుగడుగునా అడ్డుపడ్డ టీడీపీ నాయకులు..

శిథిలావస్థకు చేరుకున్న మార్కెట్‌ను అభివృద్ధి చేయాలని ప్రజలు ఎన్నిసార్లు విన్నవించిన గత టీడీపీ పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. పట్టణాభివృద్ధిని ఆకాంక్షిస్తూ మార్కెట్ అభివృద్ధికి ఎమ్మెల్యే కేతిరెడ్డి చర్యలు చేపట్టగానే కుట్రలకు తెర లేపారు. మార్కెట్ నిర్మాణం పూర్తయితే తమ మనుగడ కష్టంగా ఉంటుందని భావించిన టీడీపీ నాయకులు పాత మార్కెట్ తొలగింపును అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే కొత్త మార్కెట్ నిర్మాణానికి వ్యాపారులు, ప్రజలు పూర్తిస్థాయి మద్దతు తెలపడంతో వారి కుట్రలు ఫలించలేదు.

నేడు ప్రారంభోత్సవం..

ఆధునిక వసతుల నిర్మాణం పూర్తి చేసుకున్న కాయగూరల మార్కెట్ వాణిజ్య సముదాయాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి గురువారం ప్రారంభించనున్నారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ మార్కెట్‌కు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డి కాయగూరల మార్కెట్‌గా నామకరణం చేస్తూ మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

ఎంతో బాగుంది


గతంలో కాయగూరల కొనుగోలుకు మార్కెట్‌కు వెళ్లాలంటే ఇబ్బంది పడేవాళ్లం. ఎక్కడా నిలువ నీడ ఉండేది కాదు. వర్షాకాలంలో అయితే దుర్గంధంతో అవస్థలు పడేవాళ్లం. కనీసం మరుగుదొడ్లు కూడా ఉండేవి కావు. కొత్తగా నిర్మించిన మార్కెట్ చాలా బాగుంది.
– కె.శాంతి, గృహిణి, శారదానగర్, ధర్మవరం

ఇబ్బందులు వర్ణనాతీతం


గతంలో పండించిన కాయగూరలను మార్కెట్‌లో అమ్ముకునేందుకు వస్తే తెల్లవార్లూ దోమలతో కుట్టించుకుని నానా ఇబ్బందులు పడ్డాం. కనీసం విశ్రాంతి తీసుకునేందుకు ఇంత చోటు కూడా ఉండేది కాదు. ఇప్పుడు మార్కెట్‌ను చూస్తుంటే ఎంతో బాగుంది. రైతుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.
– బి.సూర్యనారాయణ, రైతు, వెంకటగారిపల్లి, బత్తలపల్లి మండలం

ఆనందంగా ఉంది


కాయగూరల మార్కెట్ నూతన భవనాలు ఎంతో బాగున్నాయి. దీని వల్ల మా వ్యాపారం సజావుగా సాగుతుంది. గుడ్‌విల్ ఓపెన్ యాక్షన్ ద్వారా మేము గదులను పొందాం. మార్కెట్‌ను అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే కేతిరెడ్డికి కృతజ్ఞతలు.
– సాదిక్, కాయగూరల వ్యాపారి, ధర్మవరం

ఎన్నో ఒడిదుడుకులు


ధర్మవరంలో ఏళ్ల తరబడి కాయగూరల మార్కెట్ అభివృద్ధికి నోచుకోలేదు. పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ప్రజలు, వ్యాపారులు పడుతున్న ఇబ్బందులు గమనించి ఎంతో ప్రతిష్టాత్మకంగా అన్ని వసతులతో మార్కెట్‌ను నిర్మించాం. ఈ నిర్మాణంలో ప్రతిపక్షాల నుంచి ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రజాబలంతో అన్నింటినీ ఎదుర్కొని, మార్కెట్ నిర్మాణం పూర్తి చేశాం.
– కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్యే, ధర్మవరం

ఇద్దరికి తీవ్రగాయాలు

బత్తలపల్లి: ట్రాక్టర్‌లో తరలిస్తున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం నల్లబోయనపల్లి నివాసి అభిరామ్‌రెడ్డి బుధవారం వ్యక్తిగత పనిపై మండల కేంద్రానికి వచ్చాడు. పని ముగించుకుని స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై బయలుదేరుతుండగా దంపెట్ల వరకూ తానూ వస్తానని వాహనాన్ని డి.చెర్లోపలివీఆర్‌ఏ గంగాధర్ ఎక్కాడు. తంబాపురం క్రాస్ వద్దకు చేరుకోగానే ఎదురుగా ట్రాక్టర్‌లో తరలిస్తున్న విద్యుత్ స్తంభాన్ని గమనించకుండా వేగంగా వెళ్లి ఢీకొన్నారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు వెంటనే ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. వీరిలో గంగాధర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

వివాహిత బలవన్మరణం

చిలమత్తూరు: మండలంలోని మొరసలపల్లిలో వివాహిత అనూష(22) ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు.. బుధవారం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో అనూష ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలికి తొమ్మిది నెలల పాప ఉంది. కాగా, ఆమె మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అదనపు కట్నం వేధింపులపై అనంపురం దిశ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలను దిశ సీఐ చిన్న గోవిందు వెల్లడించారు. ఉరవకొండకు చెందిన గన్నేరు సునీతకు 2008లో బొమ్మనహాళ్ మండలం గోవిందవాడకు చెందిన హెడ్డే రామచంద్రతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అదనపు కట్నం కోసం సునీతను భర్త వేధిస్తున్నాడు. ఈ వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో భరించలేని సునీత బుధవారం అనంతపురం దిశ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ అనంతరం ఆమె భర్త రామచంద్రపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బీజేపీ కుట్ర సాగనివ్వం

- కర్ణాటక ఎన్నికల్లో గెలుపు కోసమే అడ్డగోలు నిర్ణయాలు
- అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణంతో రాయలసీమ ఎడారే
- పోరుబాటకు సిద్ధం కావాలన్న ప్రజాసంఘాలు


సంఘీభావం తెలుపుతున్న రాజకీయ, రైతు, ప్రజా సంఘాల ప్రతినిధులు

అనంతపురం సిటీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నియంతృత్వ ధోరణి వల్ల ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఏర్పడిందని రాజకీయ పార్టీలు, రైతు, ప్రజా సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కర్ణాటకలోని ఎగువ భద్ర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు వాటిల్లే ప్రమాదంపై జెడ్పీ సమావేశ మందిరంలో సీపీఐ అనుబంధ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం సదస్సు నిర్వహించారు. రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో పలువురు వక్తలు మాట్లాడుతూ.. టీబీ డ్యామ్‌కు ఎగువన అప్పర్ భద్ర ప్రాజెక్ట్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా కల్పిస్తూ రూ.వేల కోట్ల నిధులు మంజూరు చేయడాన్ని తప్పుబట్టారు. కేవలం కర్ణాటకలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న కుయుక్తితో రాయలసీమను బలి చేసే పన్నాగానికి బీజేపీ పెద్దలు శ్రీకారం చుట్టారని మండిపడ్డారు. ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయితే భవిష్యత్తులో రాయలసీమకు నీటి లభ్యత ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా రాయలసీమ ప్రాంతం ఎడారిగా మారే ప్రమాదముందన్నారు. రాయలసీమతోపాటు తెలంగాణలోని రాజోలి బండ ప్రాజెక్ట్, శ్రీశైలం డ్యాంకు సైతం నీరందే పరిస్థితి ఉండదన్నారు. రాయలసీమకు సాగునీరు అందితేనే పంటలు పండుతాయని, లేకపోతే లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీటికీ కటకటలాడాల్సిన పరిస్థితి తలెత్తుతుందని హెచ్చరించారు. నీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలు, ప్రజా, రైతు సంఘాలతోపాటు ఈ ప్రాంత ప్రజలందరిపై ఉందన్నారు. ఈ అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ఈ నెల 13 నుంచి 24వ తేదీ వరకూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రజామద్దతుతో బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు సాగిస్తామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.తులసిరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, ఉమ్మడి జిల్లా ఆంధ్రప్రదేశ్ సాగునీటి ప్రాజెక్టుల విశ్లేషకుడు లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి జాఫర్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా, రైతు సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి ప్రభుత్వం చేయూత

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి


మహిళా మార్ట్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ కోటి సుధ (చిత్రంలో) ఎమ్మెల్యే కేతిరెడ్డి, తదితరులు

బత్తలపల్లి: మహిళల ఆర్థికాభివృద్ధికి జగన్ సర్కార్ పటిష్ట చర్యలు చేపట్టినట్లు ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తెలిపారు. బత్తలపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌ను స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధతో కలసి బుధవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. మార్కెట్ ధరల కన్నా తక్కువకే నాణ్యమైన నిత్యావసర సరుకులను గ్రామీణులకు అందించేందుకు మహిళా మార్ట్‌ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తోందన్నారు. పొదుపు సంఘాల మహిళల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సూపర్ మార్కెట్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, చేయూత డీపీఎం రమణప్ప, ఏసీ రామేశ్వరరెడ్డి, ఏపీఎంలు, శోభారాణి, సీసీలు, మార్ట్ అధ్యక్షులు, సభ్యులు, ధర్మవరం క్లస్టర్ ఆరు మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


గోపాల్ (ఫైల్)

పెనుకొండ రూరల్: మద్యం కొనుగోలుకు డబ్బు సమకూరకపోవడంతో మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని ఇస్లాపురం నివాసి గొల్ల గోపాల్ (35), అలివేలమ్మ దంపతులు. వీరికి నలుగురు కుమార్తెలు ఉన్నారు. గోపాల్ మద్యానికి బానిస కావడంతో కుటుంబ పోషణ భారం మొత్తం అలివేలమ్మపై పడింది. ఈ క్రమంలో మద్యం కొనుగోలుకు అవసరమైన డబ్బు సమకూరకపోవడంతో మంగళవారం రాత్రి దాదాపు 11 గంటలకు గోపాల్ ఇంటి వెనుక చెట్టుకు తన పంచెతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పరిశ్రమల స్థాపనే ప్రభుత్వ లక్ష్యం

- ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల అవగాహన సదస్సులో జిల్లా పరిశ్రమల ఏడీ రాజశేఖరరెడ్డి


మాట్లాడుతున్న రాజశేఖరరెడ్డి

యాడికి: చిన్న, మధ్య తరహాతో పాటు భారీ పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే యువతకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు జిల్లా పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖరరెడ్డి సూచించారు. పరిశ్రమల ఏర్పాటు అంశంపై ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఏడీ రాజశేఖర రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పరిశ్రమల స్థాపనే లక్ష్యంగా ప్రభుత్వం పలు రాయితీలను అందజేస్తోందన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలైన రైస్‌మిల్లు, కోల్డ్ స్టోరేజీ ప్లాంటు, పండ్ల ప్రాసెసింగ్ యూనిట్, గ్రౌండ్‌నట్ డెకార్టికేటర్, ఖనిజ ఆధారిత పరిశ్రమలైన సిమెంట్, ఫ్లైయాస్ ఇటుకల తయారీ, హైడ్రేటెడ్ సున్నం, పైపులు, సిమెంటు రేకులు, స్టోన్ పాలిసింగ్, క్రషర్, పల్వరైజింగ్ ఆఫ్ మినరల్స్, గ్రానైట్ కటింగ్ – పాలిసింగ్, పశు సంపద ఆధారిత పరిశ్రమలైన పాల ఉత్పత్తులు, వస్త్ర పరిశ్రమలైన రెడిమేడ్ దుస్తులు, జీన్స్ ప్యాంట్లు, ఆటోమొబైల్, బొరుగుల బట్టీ వంటి వాటిని స్థాపించుకుంటే స్వయం ఉపాధితో పాటు మరో పది మందికి జీవనోపాధి కల్పించినట్లవుతుందన్నారు. ఆ దిశగా యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, పరిశ్రమల అధికారి ఐజయ్య పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగాల అభ్యర్థులకు ఉచిత శిక్షణ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు తర్వాతి పోటీ పరీక్షలకు సంబంధించిన అంశాలపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా పోలీస్ లైబ్రరీలో శిక్షణ పొందుతున్న వారిలో 94 మంది అభ్యర్థులు రాత పరీక్షల్లో అర్హత సాధించినట్లు గుర్తు చేశారు. వీరికి ఫిజికల్ ఈవెంట్స్‌పై శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వీరితో పాటు అర్హత సాధించి ఆసక్తి ఉన్న అభ్యర్థులకూ పోలీస్ పరేడ్ మైదానంలో 1,600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ తదితర అంశాలపై ఉదయం, సాయంత్రం సుశిక్షితులైన సిబ్బందితో శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న మస్తాన్

కదిరి అర్బన్: స్థానిక వ్యవసాయమార్కెట్ యార్డు కార్యదర్శి పద్మావతి వేధింపులు తాళలేక మార్కెట్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మస్తాన్ బుధవారం ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునే యత్నం చేశాడు. గమనించిన సాటి ఉద్యోగులు వెంటనే అడ్డుకున్నారు. పెట్రోల్ పోసుకుంటున్న సమయంలో కంటిలో పడడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై కార్యదర్శిని వివరణ అడిగేందుకు ప్రయత్నిస్తే ఆమె అందుబాటులోకి రాలేదు. సమాచారం అందుకున్న మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మొలక సుజాత... ఆస్పత్రికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు.